క్లుప్తంగా

స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ

భీమవరం: స్టేట్ లెవెల్ ఓపెన్ మాస్టర్ స్విమ్మింగ్ పోటీల్లో భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. విజేతలు ఈ నెల 28, 29 తేదిల్లో గుంటూరు మున్సిపల్ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని శ్రీనివాసరావు చెప్పారు. పతకాలు గెలుచుకున్న కృష్ణశ్రీనివాస్, వంశీకృష్ణలను కళాశాల ప్రిన్సిపల్ మగం వేణు, కోచ్‌లు సీహెచ్ఎస్ఎస్ వర్మ, పి.ఏండుకొండలు, శ్రీనివాసరావు అభినందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పాలకోడేరు: మండల వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్లో 10,500 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి వి.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండు రోజుల నుంచి మండలంలోని గరగపర్రు, కొండేపూడి, విస్సా కోడేరు తదితర గ్రామాలలో కోతలు ప్రారంభమైనట్టు, ధాన్యం కొనుగోలు నిమిత్తం మండలంలోని 12 రైతు భరోసా కేంద్రాలలో సుమారు 1,20,000 గోనె సంచులను అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. బుధవారం గరగపర్రు గ్రామంలో రైతు సేవా కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోలు ప్రారంభించి మిల్లుకు తరలించామని పేర్కొన్నారు.

వైభవంగా పాండురంగ కల్యాణం

కాళ్ల: స్థానిక శ్రీ రుక్మిణి సమేత పాండురంగస్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి రుక్మిణి సమేత పాండురంగస్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శాశ్వత ధర్మకర్త మందలపర్తి శ్రీచంద్రశేఖర్, కమిటీ సభ్యులు, భక్తులు ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం వేదమంత్రాల నడుమ వైభవోపేతంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పెంటపాటి వెంకట నాగేశ్వరరావు, వరలక్ష్మి దంపతులు, శిరిగినీడి కోటిపాండురంగపద్మారావు, పావని దంపతులతో శాస్త్రోక్తంగా అత్యంత భక్తిశ్రద్ధలతో కల్యాణం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలనుంచి పెద్దఎత్తున భక్తులు హాజరై స్వామి వారిని అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

20న కార్తీక దీపోత్సవం

భీమవరం(ప్రకాశం చౌక్): ఈ నెల 20వ తేదీన భీమవరం ఆనంద ఫంక్షన్ హాల్ నందు ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్, దేవదాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీశైల క్షేత్ర ఉత్సవ మూర్తులకు కల్యాణోత్సవం, కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆనంద ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు తెలిపారు. ఈ పూజల్లో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కంతేటి వెంకట్రాజు, చెరుకువాడ రంగసాయి, చంద్రాజీ, తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వనవిహార్ బ్రోచర్ ఆవిష్కరణ

భీమవరం: ప్రకృతి ఆశ్రమం వద్ద ఈ నెల 17న కార్తీక మాసాన్ని పురస్కరించుకుని హిందూ వనవిహార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ కన్వీనర్ మంతెన రామచంద్రరాజు చెప్పారు. బుధవారం భీమవరంలో విలేకరులకు వివరాలను వెల్లడించారు. ఆదివారం గోపూజ, కార్తీక దామోదర పూజ, కడప జిల్లా అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానంద స్వామీజీ అనుగ్రహ భాషణం, సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు, వన సమారాధన నిర్వహిస్తున్నామన్నారు. వనవిహార్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో వబిలిశెట్టి శ్రీ వెంకటేశ్వర్లు, చింతోజు ప్రసాద్, మజ్జి మహేష్, ఇళ్ల హరికృష్ణ, సుశాంత్ వర్మ పాల్గొన్నారు.

స్వాతంత్రోద్యమంలో గ్రంథాలయాల పాత్ర కీలకం

- జిల్లాలో లైబ్రరీల విస్తరణకు కృషి
- నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

వీరావాసరం: పుస్తకం ఓ వ్యక్తి జీవితాన్ని మారిస్తే, గ్రంథాలయం ఓ తరాన్ని ప్రభావితం చేస్తుందన్నది నానుడి. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలుగా పేరొందాయి. ఇంతటి ప్రాధాన్యమున్న గ్రంథాలయాల అభివృద్ధికి ఎందరో మహానుభావులు పాటు పడ్డారు. స్వాతంత్రోద్యమానికి దీటుగా రాష్ట్రంలో గ్రంథాలయోద్యమం నడిపారు. స్వాతంత్రోద్యమంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషించాయి. గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకట రమణ వీరి స్ఫూర్తితో స్వాతంత్ర్యానికి పూర్వమే జిల్లాలో కాళ్లకూరి నరసింహం, భూపతిరాజు తిరుపతిరాజు గ్రంథాలయాల ఏర్పాటుకు విశేష కృషి చేసి, గ్రంథాలయ ధన్యులుగా పేరు గడించారు. 14వ తేదీ నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నారు. గ్రంథాలయోద్యమ స్ఫూర్తితో కాళ్లకూరి నరసింహం తన అమ్మమ్మ ఊరు వీరవాసరం మండలం రాయకుదురు 1894లో జిల్లాలోనే తొలిసారిగా సుజనానంద గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 100 మంది సభ్యులతో 24 పత్రికలు, 2,859 గ్రంథాలు, పుస్తకాలతో ప్రారంభమైన రాయకుదురు గ్రంథాలయం



రాయకుదురులో శాఖా గ్రంథాలయం

1967లో జిల్లా గ్రంథాలయ సంస్థ పరమైంది. పాత గ్రంథాలయ భవనం శిథిలమవడంతో దివంగత ధూళిపాళ వేణుగోపాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో నూతన భవనాన్ని నిర్మించారు. ఇక్కడ పురాతన విలువైన గ్రంథాలు ఇప్పటికీ భద్రంగా ఉన్నాయి. ప్రస్తుతం 806 మంది సభ్యులతో 22 పత్రికలు, 15,226 పుస్తకాలతో సేవలందిస్తుంది. గత ఏప్రిల్‌లో గ్రంథాలయంలో ఇంటర్నెట్ సదుపాయం కల్పించారు. గంటకు రూ.5 చెల్లించి ఇంటర్నెట్‌ను వినియోగించుకోవచ్చని గ్రంథాలయాధికారి చిన బాబు తెలిపారు.

ఏవో హ్యూమ్ పేరున రెండోది

ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏవో హ్యూమ్ పేరున కాళ్లకూరి నరసింహం స్వగ్రామమైన కోపల్లెలో 1885లో రెండో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అదే ఏడాది ఉండిలో దాదాభాయి నౌరోజీ పేరిట మూడో గ్రంథాలయాన్ని స్థాపించారు. భూపతిరాజు తిరుపతిరాజు 1897లో కుముదవల్లి గ్రామంలో వీరేశలింగం కవి సమాజ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ గ్రంథాలయ ఉద్యమ ఉత్సాహం ఇతర ప్రాంతాలపై మంచి ప్రభావాన్ని చూపింది. 1904లో ఏలూరులో వైఎంహెచ్ఏ, 1910లో పడమర విప్పర్రులో వివేకానంద పఠనం మందిరం, 1911లో పాలకొల్లులో రామమోహన్ క్లబ్, 1912లో దెందులూరులో వివేకానంద్ క్లబ్, 1913లో తణుకులో జ్ఞానోదయ స్త్రీ సమాజం, 1914లో పోడూరులో రామచంద్ర గ్రంథాలయం, అదే నిడమర్రులో పోతన గ్రంథాలయాల ఏర్పాటుకు ప్రేరణగా నిలిచింది.

తగ్గుతున్న ఆదరణ

స్వాతంత్రోద్యమానికి దీటుగా సాగిన గ్రంథాలయ ఉద్యమ స్ఫూర్తి ప్రస్తుత తరంలో కనిపించడం లేదు. పుస్తక పఠనంపై ఆసక్తి తగ్గడమే ఇందుకు కారణంగా కనిపిస్తుంది. ప్రజాప్రతినిధులు సైతం గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం నిధులు సమకూర్చకపోవడంతో గ్రంథాలయాల నిర్వహణ కష్టంగా మారుతుంది. దాతల సహకారంతోనే నెట్టుకురావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. జిల్లాలోని పలు గ్రంథాలయాలను నిధుల లేమికి తోడు సిబ్బంది కొరత వేధిస్తుంది. గ్రంథాలయాలు అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేసి అభివృద్ధి చేయాలని పాఠకులు కోరుతున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు

భీమవరం(ప్రకాశం చౌక్): త్యాగరాజ భవన్‌లో బుధవారం ఆర్యవైశ్య వర్తక సంఘం, ఏలూరు ఆశ్రమం ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో 480 మంది కంటి పరీక్షలు నిర్వహించారు. కొందరికి ఉచితంగా కళ్ల అద్దాలు, మరి కొందరికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు అప్పారావుపేటలో లక్ష కుంకుమార్చన

ఆకివీడు: మండలంలోని అప్పారావు పేట గ్రామంలో ఉన్న ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు సామవేదం సుధాకర్ శాస్త్రి బుధవారం విలేకరులకు చెప్పారు. ఈ సందర్భంగా 108 మంది ముత్తయిదువులతో అమ్మవారికి పసుపు, కుంకుములు సమర్పిస్తారన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ అనుసంధానం చేయాలి

భీమవరం(ప్రకాశం చౌక్) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు లబ్ధిదారుల ఖాతాలకు జమ కావడానికి ఎన్‌పీసీఐ లింకును వారి బ్యాంకు ఖాతాలకు అనుసంధానం అయ్యేలా వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ వార్డు అడ్మిన్ సెక్రటరీలతో గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ వివిధ రకాల ప్రభుత్వ పథకాలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవ్వాలంటే ఎన్‌పీసీఐ బ్యాంక్ ఖాతాకు అనుసంధానం చేయాలన్నారు. జిల్లాలోని 90 చోట్ల ఆధార్ తప్పిదాలు ఉన్న విద్యార్థులకు ఆపార్ రిజిస్ట్రేషన్, తప్పుల సవరణకు ఈ నెల 12 నుంచి 28 వరకు ప్రభుత్వం ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తుందన్నారు.

స్టార్టప్‌లతో ఆదాయం

భీమవరం: విద్యార్థి దశలోనే స్టార్టప్‌లతో మంచి ఆదాయాన్ని పొందుతూ చదువు కొనసాగించే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ అన్నారు.

చిన్నారి చేతనకు ఇంటర్నేషనల్ రికార్డు



భీమవరం: ఎనిమిదన్నరేళ్ల వయస్సులోనే 108 పర్యాయాలు భగవద్గీత పారాయణంతో ప్రపంచంలోనే మొట్టమొదటి అమ్మాయిగా గుర్తింపు పొంది ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు సాధించింది భీమవరం సమీపంలోని కొవ్వాడ గ్రామానికి చెందిన బొలిశెట్టి చేతన. చేతన ఆరేళ్ల 11 నెలల 28 రోజుల వయసులో భగవద్గీతలోని 72 శ్లోకాలను 28 నిముషాల 30 సెకండ్స్‌లో పఠించడంతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ సాధించింది. గతేడాది విశ్వహిందూ పరిషత్ నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పోటీల్లో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. అన్నవరం, సింహాచలం, అప్పనపల్లి, ద్వారకాతిరుమలతోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలోని 108 చోట్ల భవతద్గీత తెలుగు అర్థాలతో పారాయణం చేసింది.

ఘనంగా ద్వాదశి పూజలు

ఉండి: చిలుకు ద్వాదశి కార్తీకమాస పూజా కార్యక్రమాలను పురస్కరించుకుని ఉండి రాజులపేటలో ఉన్న పార్వతీసమేత చెన్నమల్లేశ్వరునికి ఘనంగా పూజలు నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొనగా స్వామివారికి పంచామృతాలు, జామ రసంతో అభిషేకం, జామకాయలతో ప్రత్యేక అలంకరణ, అమ్మవారికి కుంకుమార్చన, సరస్వతీదేవీ, సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక పూజలు, ఆకాశదీపారాధన చేశారు. ఆలయంలోని శివ ఉద్యానవనంలో కార్తీక దామోదర పూజ, విష్ణుమూర్తి పూజలు నిర్వహించారు. అనంతరం అవునెయ్యితో సామూహికంగా మహిళలతో ద్వాదశి దీపాలు వెలిగించారు. ఆయా కార్యక్రమాలు ఆలయ ప్రధానార్చకులు సన్నిధిరాజు కృష్ణ, సన్నిధిరాజు చలపతిరావు, తాడేపల్లి కిరణ్‌శర్మ, ఏలూరు పార్టీ ఫణిశర్మ, మావిడి అన్న ప్రదీప్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

కాళ్లకూరులో..

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం, క్షీరాబ్ధి (చిలుకు) ద్వాదశి సందర్భంగా బుధవారం రాత్రి కన్నుల పండువగా శ్రీవారికి తెప్పోత్సవం నిర్వహించారు. మేళతాళాలతో తొలుత స్వామి, అమ్మవార్లను శేషవాహనంపై పురవీధులమీదుగా ఊరేగింపుగా పద్మావతి పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై పూజలు నిర్వహించారు. బాణసంచా వెలుగులు, వేదమంత్రాల నడుమ గోవింద నామస్మరణతో భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను దేవస్థానం ఈవో ఎం.అరుణ కుమార్ పర్యవేక్షించారు.





ద్వాదశి పూజలందుకుంటున్న చెన్నమల్లేశ్వరస్వామి
వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

జమిలి ఎన్నికల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

భీమవరం అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా తీసుకొస్తున్న జమిలి ఎన్నికల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని గొల్లవానితిప్ప, గూట్లపాడు, తోకతిప్ప, రామాయణపురం గ్రామాల్లో బుధవారం సీపీఎం నాయకులు ప్రజా పోరు ప్రచార యాత్ర చేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో అన్ని కులాలు, మతాలు భిన్నత్వంలో ఏకత్వంతో మెలుగుతున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం జమిలి ఎన్నికలకు మద్దతు ఇచ్చారని ప్రజలు వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో తిరుమాని నాగేశ్వరరావు, బొడ్డు లక్ష్మీపతి, వాటాల పెద్దిరాజు, వేగి మోహన్‌రావు, చింతా రాజేష్, తానేటి రవి, పట్టెం శుభాకర్‌రావు పాల్గొన్నారు.



ప్రజాపోరు ప్రచార యాత్రను నిర్వహిస్తున్న మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్

ప్రాతాళ్ల మెరకలో ట్రైనీ ఐఏఎస్‌ల పర్యటన

కాళ్ల: మండలంలోని ప్రాతాళ్ల మెరక గ్రామంలో బుధవారం ట్రైనీ ఆఫీసర్ల బృందం పర్యటించింది. ముస్సోరిలోని అకాడమీ నుంచి వచ్చిన కాత్యాయని సింగ్ – ఐఎఫ్ఎస్, శ్రీకృష్ణ శ్రీరామ్ సుధీర్ – ఐఏఎస్, లక్ష్మణ్ ఆనంద్ ఐఎఫ్ఎస్, భగత్ శ్యామల్ కళ్యాణరావ్ – ఐఏఎస్, రూపాలి సురాణా – ఐఆర్ఎస్(ఐటీ) ఫీల్డ్ స్టడీ అండ్ రీసెర్చ్ ప్రోగ్రాంలో భాగంగా క్షేత్ర స్థాయిలో పర్యటించారు. మండలస్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సంక్షేమ పథకాలు అమలు, అభివృద్ధి పనులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో విజయలక్ష్మి మెమోరియల్ ట్రస్టు అధినేత వేగిరాజు శివవర్మ గ్రామ అభివృద్ధి కోసం చేస్తున్న పనులను అడిగి తెలుసుకుని పరిశీలించారు.



గ్రామ పెద్దలు, డ్వాక్రా సంఘాల మహిళలతో మాట్లాడుతున్న ట్రైనీ ఆఫీసర్లు

స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

ఆకివీడు: స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించుకునేందుకు కళాశాల పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని ప్రిన్సిపాల్ కె.సుజాత పిలుపునిచ్చారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం బుధవారం కళాశాల ఆవరణలో జరిగింది. సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 50 ఏళ్ల చరిత్ర కలిగిన కళాశాల వైభవాన్ని ప్రజలకు మరింతగా తెలియజేసేందుకు శక్తివంచన లేకుండా పూర్వ విద్యార్థులు కృషి చేయడం అభినందనీయమన్నారు. వచ్చే ఏడాది జనవరి 12న స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణకు పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులతో కలిసి తొమ్మిది విభాగాలను ఏర్పాటు చేసి, వాటికి కమిటీలను నియమించారు. ఆయా కమిటీల విధి విధానాలను ప్రిన్సిపాల్ సుజాత తెలియజేశారు. వేదికలకు కళాశాలలో చదివి ఉన్నత శిఖరాల్ని అధిరోహించిన విశ్రాంతి ఉద్యోగులు, ప్రస్తుత ఉద్యోగుల్ని ముఖ్య అతిథులుగా పిలవాలని సమావేశం నిర్ణయించింది. వీరితో పాటు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలను ముఖ్య అతిథులుగా పిలిచేందుకు సమావేశం నిర్ణయించింది. ఈ సందర్భంగా కళాశాల చరిత్రను తెలిపే విధంగా సావనీర్‌ను ముద్రించాలని సూచించారు. పూర్వ విద్యార్థుల సమావేశం మరోసారి ఏర్పాటు చేయనున్నట్లు పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు గొంట్లా కృష్ణ మూర్తి చెప్పారు. సమావేశానికి పూర్వ విద్యార్థులంతా హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సర్పంచ్ ముద్దే విశ్వేశ్వరరావు, కార్యదర్శి నేరెళ్ల రామ చెంచయ్య, పూర్వ విద్యార్థులు చింతలపాటి సీతారామరాజు, చొప్పెర్ల శ్రీరామచంద్రమూర్తి, గుర్రం ఈశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణోత్సవాలపై చర్చిస్తున్న పూర్వ విద్యార్థి సంఘ ప్రతినిధులు, ప్రిన్సిపాల్

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

భీమవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై వేస్తున్న భారాలను తగ్గించి, ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం భీమవరం పట్టణం ప్రకాష్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం, కర పత్రాల పంపిణీతో ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఎం.వైకుంఠరావు బొక్కా సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన కూటమి ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి ఎన్నికల అనంతరం ప్రజలపై అనేక రూపాల్లో భారాలు వేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో డి.త్రిమూర్తులు, దుర్గారావు, యాకోబు, మావుళ్లమ్మ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి

వీరవాసరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ట్రూ అప్ చార్జీల పేరుతో పెంచిన రూ.20 వేల కోట్ల విద్యుత్ చార్జీలు తక్షణం రద్దు చేయాలని సీపీఎం జిల్లా నాయకులు జుత్తిగా నరసింహమూర్తి డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన ప్రజా పోరు బాట ప్రచార కరపత్రాలు బుధవారం నవుడూరు జంక్షన్‌లో పంచుతూ ప్రచారం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా 15వ తేదీన శుక్రవారం కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాలో అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో ఆయనకుడి బాబు పాలకోటేశ్వరరావు యళ్ల బండి నారాయణమూర్తి కిలాడి సత్యనారాయణ గిద్ద శీను మేఘపు త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపోరు కార్యక్రమం నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

ప్రజా సమస్యల పరిష్కారానికి ధర్నాలు

భీమవరం : దేశంలో నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరలు, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు వంటి సమస్యలను గాలికొదిలేసి జమిలి ఎన్నికల నిర్వహణ అంశాలను ముందుకు తీసుకురావడం దారుణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం అన్నారు. బుధవారం మెంటేవారితోటలో జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ఈ నెల 14న మండల తహసీల్దారు కార్యాలయాలు, 15న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరామ్ మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసరాల ధరలు అరికట్టాలని, ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని, మద్యం షాపుల్లో విచ్చలవిడి అమ్మకాలు నియంత్రించాలన్నారు. సెక్రటేరియట్ సభ్యుడు జెఎన్‌వీ గోపాలన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చింతకాయల బాబూరావు, కవురు పెద్దిరాజు, కేతా గోపాలన్, డి.కల్యాణి, బి.వాసుదేవరావు, కర్రా నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామ్

మోగల్లులో వైద్య శిబిరం

పాలకోడేరు: విజృంభిస్తున్న విష జ్వరాలు శీర్షికన బుధవారం సాక్షి దిన పత్రిక లో వచ్చిన వార్తకు వైద్యాధికారులు స్పందించారు. బుధవారం మోగల్లు గ్రామం లో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గులాబ్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చినమిల్లి వెంకట రంగమనాయుడు, సిబ్బంది ఇంటింటికీ తిరిగి సర్వే చేశారు. కొన్నిచోట్ల సాధారణ జ్వరాలతో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించామని రంగమనాయుడు తెలిపారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు మందులు పంపిణీ చేసినట్లు ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉన్నట్లయితే గ్రామంలోని తమ ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఈ శిబిరంలో ఆయనతోపాటు డాక్టర్ స్వర్ణ నిరంజని, డాక్టర్ గులాం రాజకుమార్, సీహెచ్ఓ సత్యనారాయణ, ఏఎన్ఎంలు ధనలక్ష్మి, ఉషా సుందరి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



మోగల్లు లో ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సాక్షి స్పందన

సంస్కృతీ సంప్రదాయాలకు నిలయం భారతదేశం

భీమవరం అర్బన్: సంస్కృతీ సంప్రదాయాలకు నిలయం భారతదేశమని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. భీమవరం మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ కార్తీకమాసానికి ఎంతో విశిష్టత ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు పత్రిపాటి శ్రీనివాస్, కార్యదర్శి, కోశాధికారి సోము వెంకటేష్, మహిళా అధ్యక్షురాలు పత్రిపాటి రత్నకుమారి, సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ, బొండాడ రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్ ఢీకొని వ్యక్తికి గాయాలు

భీమవరం: టుటౌన్ పరిధిలోని జువ్వలపాలెం రోడ్డులో ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్ ఢీకొని రాయలం గ్రామానికి చెందిన చల్లా రాంప్రసాద్ గాయపడినట్లు టూటౌన్ ఎస్సై రెహమాన్ చెప్పారు. బుధవారం రాంప్రసాద్ మోటారు సైకిల్‌పై వస్తుండగా ఎదురుగా వచ్చిన మోటారు సైకిల్ ఢీకొనగా పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు రాంప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రెహమాన్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండి: ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యలమంచిలి మండలం అడవిపాలెం గ్రామానికి చెందిన సలాది గోపీకృష్ణ(40) అనే వ్యక్తి కిరణాషాపులు, బడ్డీ కొట్లుకు స్నాక్స్‌ను హోల్‌సేల్‌గా అమ్ముకునే వ్యాపారం చేస్తున్నాడు. దీనిలో ఈ నెల 9వ తేదీన భాగంగానే స్వగ్రామం నుంచి విజయవాడ వెళ్లిన గోపీకృష్ణ తిరుగు ప్రయాణంలో ఉండి మీదుగా స్వగ్రామానికి వెళుతుండగా ఉండి శివారులో ప్రమాదవశాత్తూ ద్విచక్రవాహనం జారిపోవడంతో అతడు కింద పడిపోయాడు.ఈ ప్రమాదంలో బాధితుడి తలకు తీవ్రంగా గాయం కావడంతో 108 సహాయంతో భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న గోపీకృష్ణ 12వ తేదీ రాత్రి 9 గంటలకు మృతి చెందాడు.ఈ ప్రమాదంపై మృతుని అన్న శ్రీవెంకట సత్య ఉదయ్‌కుమార్ ఫిర్యాదుతో ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు ఏఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడి

ఆకివీడు: సిద్ధాపురం రోడ్డులోని డంపింగ్ యార్డు వద్ద బుధవారం పేకాట స్థావరంపై ఎస్సై హనుమంతు నాగరాజు పోలీసు సిబ్బంది దాడి చేసి రూ.71,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఘటనలో 13 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి పేకలతో పాటు 7 సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్లు ఎస్సై నాగరాజు చెప్పారు. మంగళవారం రాత్రి దుంపగడపలో పేకాడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని వారి రూ.14,790 నగదు, 8 సెల్‌ఫోన్లు, నాలుగు మోటారు సైకిళ్లు సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.